క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 19న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. బొల్లికుంట మెయిన్ రోడ్డు, వాగ్దేవి కళాశాల, నవయుగ కాలనీ, టీచర్స్ కాలనీ, గణేష్ నగర్, ఏకశిల నగర్, కళ్యాణి నగర్, పోచమ్మమైదాన్ కూడలి ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కేయూ వీసీ, రిజిస్ట్రార్‌కు సన్మానం



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో 23వ స్నాతకోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించిన కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం, ఓఎస్డీ ప్రొఫెసర్ మల్లారెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ రాజేందర్‌ను కేయూ పరిశోధకులు శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో అంకిల్ల శంకర్, పసుల జానకి, కల్లెపెల్లి ప్రశాంత్, పాషా, నమిల సుమన్, భిక్షపతి, మేకల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నృత్యకారిణి ధనశ్రీకి సన్మానం



కేయూ క్యాంపస్: హనుమకొండకు చెందిన రామారపు రాజు, సంధ్య దంపతుల కుమార్తె ధనశ్రీ.. భరతనాట్యం, కూచిపూడి నాట్యంలో ప్రతిభ చూపుతోంది. తెలంగాణతో పాటు ఏపీ, కేరళ రాష్ట్రాల్లో వివిధ ప్రదర్శనలు ఇచ్చింది. ఇటీవల భూటాన్‌లోని తింపునగరం బౌద్ధ ఆలయంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో ధనశ్రీ.. భరత నాట్యాన్ని ప్రదర్శించి ప్రతిభ కనబరిచింది. ఈ మేరకు నృత్యకారిణిని కాకతీయ యూనివర్సిటీలోని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ ఈసం నారాయణ, జనరల్ సెక్రటరీ డాక్టర్ పుల్లా శ్రీనివాస్ శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో కిరణ్, దయాకర్, ప్రతాప్, మొగిలి, ప్రకాశ్, భాస్కర్, శ్రావ్య పాల్గొన్నారు.

సంరక్షణ కేంద్రానికి బాలుడు

ఖిలా వరంగల్: ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఒంటరిగా ప్రయాణిస్తున్న పశ్చిమ బెంగాల్‌కు చెందిన 15 ఏళ్ల బాలుడిని వరంగల్ రైల్వేస్టేషన్‌లో దించి బాలుర సంరక్షణ కేంద్రానికి తరలించినట్లు జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సురేందర్ తెలిపారు. ఖమ్మం – వరంగల్ రైల్వే స్టేషన్ మధ్య ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో రైల్వే అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహిస్తుండగా ఒంటరి బాలుడిని అధికారులు గుర్తించి వివరాలు తెలుసుకుని అతడి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఈ సందర్భంగా నగరంలోని ఎన్‌జీఓ గాయత్రి సంరక్షణ కేంద్రానికి తరలించినట్లు జీఆర్పీ సీఐ సురేందర్ వివరించారు.

ఇండియన్ అచీవర్ అవార్డు గ్రహీతకు అభినందన



హన్మకొండ: ఇండియన్ అచీవర్ అవార్డు గ్రహీత పల్లెపాడు దామోదర్‌ను ప్రజా సంఘాల నాయకులు సన్మానించారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ కార్యదర్శి, ఇండియన్ అచీవర్స్ అవార్డు అందుకున్న పల్లెపాడు దామోదర్‌ను ఆయా సంఘాల నాయకులు హనుమకొండ రాంనగర్‌లోని సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దామోదర్ మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలు చేసినందుకు అచీవర్స్ అవార్డు వచ్చిందన్నారు. ఈ స్ఫూర్తితో మరిన్ని సేవా కార్యక్రమాలు విస్తరిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది ఎం.మనోహర్ రావు, ఆయా సంఘాల నాయకులు రాజేష్, బొక్క రమేష్, సైదా నాయక్, ఐజక్, ప్రశాంత్ పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ముగ్గురికి జైలు

కాజీపేట: మద్యం తాగి వాహనాలు నడుపుతూ కాజీపేట పట్టణ పరిధిలో పట్టుబడిన ముగ్గురు వ్యక్తులను కోర్టులో హాజరుపర్చగా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ చిన్నప్ప వారికి రెండు రోజుల జైలుశిక్ష విధిస్తూ శుక్రవారం తీర్పు నిచ్చినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపారు. వారిని హుజురాబాద్ సబ్‌జైలుకు తరలించినట్లు వివరించారు.

జువైనల్ హోంకు 8 మంది బాలురు

వాహనాలు నడుపుతూ పట్టుబడిన 8 మంది బాలురను కోర్టులో హాజరుపర్చగా, జువైనల్ మెజిస్ట్రేట్ వారందరిని ఒకరోజు జువైనల్ హోంకు తరలిస్తూ శుక్రవారం ఆదేశాలు జారీ చేసినట్లు సీఐ వెంకన్న తెలిపారు. ఇకముందు మైనర్లు డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే వారి తల్లిదండ్రులపై కూడా కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు.

రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్ రోడ్డు అధ్వానం



కడిపికొండ బ్రిడ్జి కింద గుంతలు పడిన రోడ్డు



కంకరతేలిన బాపూజీ నగర్ - లోకోషెడ్ రోడ్డు

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్‌కు వెళ్లే ప్రధాన రోడ్డు అధ్వానంగా మారింది. కాజీపేట బాపూజీనగర్ మెయిన్ రోడ్డు నుంచి ఎలక్ట్రిక్ లోకోషెడ్‌కు వెళ్లే ప్రధాన మార్గంతో పాటు కాజీపేట రైల్వే స్టేషన్ నుంచి ఎలక్ట్రిక్ లోకోషెడ్‌కు వెళ్లే రోడ్డు ధ్వంసమై గుంతలు ఏర్పడ్డాయి. కడిపికొండ ఆర్వోబీ కింద దారులు కలిసే జంక్షన్ వద్ద గుంతలు ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. వర్షాలకు గుంతల్లో నీరు నిలవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైల్వే అధికారులు, కార్మికులు వాహనాలపై పగలు, రాత్రి ఈ మార్గాల్లోనే రాకపోకలు సాగిస్తుంటారు. రైల్వే అధికారులు స్పందించి ధ్వంసమైన రోడ్లకు మరమ్మతులు చేయించాలని కార్మికులు కోరుతున్నారు.

కళాశాలల్లో గోరింటాకు వేడుకలు



గోరింటాకు చూపుతున్న ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో గోరింటాకు మహోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా లెక్చరర్లు, విద్యార్థినులు తమ చేతులకు గోరింటాకు పెట్టుకుని మురిసిపోయారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవి, శ్రీలత, రమేష్, చందర్ తదితరులు పాల్గొన్నారు.



పింగిళి మహిళా కళాశాలలో..

పింగిళి కళాశాలలో..

విద్యారణ్యపురి: హనుమకొండలోని పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో మహిళా అధ్యాపకులు, విద్యార్థినులు శుక్రవారం గోరింటాకు సంబురాలు నిర్వహించారు. కళాశాల మహిళా సాధికారిత కన్వీనర్ డాక్టర్ అరుణ, ప్రిన్సిపాల్ చంద్రమౌళితో పాటు వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుహాసిని, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ అరుణ, అధ్యాపకులు రత్నమాల, రాజేశ్వరి పాల్గొన్నారు.

కేంద్ర మంత్రుల పర్యటనను విజయవంతం చేయాలి

హన్మకొండ: కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి పిలుపునిచ్చారు. దీన్‌దయాళ్ నగర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, నాయకులు డాక్టర్ కాళీప్రసాద్, శ్రీనివాస్ రెడ్డి, కిషన్ పాల్గొన్నారు.

కాజీపేట అర్బన్: కేంద్ర మంత్రుల రాక సందర్భంగా మడికొండ చౌరస్తా నుంచి అయోధ్యపురం వరకు ద్విచక్ర వాహన ర్యాలీ చేపట్టి ఘన స్వాగతం పలకనున్నట్లు మాజీ ఎమ్మెల్యే, బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు మార్తినేని ధర్మారావు తెలిపారు.



హన్మకొండ: మాట్లాడుతున్న సంతోష్ రెడ్డి

కాజీపేట రూరల్: కేంద్ర మంత్రుల పర్యటనకు ఏర్పాట్లపై కాజీపేట రైల్వే స్టేషన్ బీవీపీ లాంజ్‌లో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ మేరకు ఏర్పాట్లపై పోలీసు, రైల్వే ఉన్నతాధికారులు, పార్టీ నాయకులు ఏర్పాట్లను పరిశీలించారు.

క్రమశిక్షణతో ముందుకు సాగాలి

హన్మకొండ చౌరస్తా: జీవితంలో ఏదైనా సాధించాలంటే విద్యార్థి దశ నుంచే ప్రణాళిక, క్రమశిక్షణతో ముందుకు సాగాలని మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ ప్రహసిత్ అన్నారు. అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్, కేయూ పాలక మండలి సభ్యురాలు డాక్టర్ అనితారెడ్డి ఆధ్వర్యంలో లష్కర్‌బజార్‌లోని ప్రభుత్వ అర్బన్ రెసిడెన్షియల్ బాలుర ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల జీవితం – విద్యా విలువలు' అనే అంశంపై శుక్రవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది దీప, శ్రీనివాస్, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ప్రహసిత్

ప్రకృతి విలువలను అభ్యసించాలి

విద్యారణ్యపురి: స్వేచ్ఛ, సమానత్వం, మానవత్వం, పర్యావరణ ప్రకృతి విలువలపై అభ్యాసం చేయాలని విద్యార్థులకు రిటైర్డ్ పీజీహెచ్ఎం రాధ సూచించారు. హనుమకొండలోని వడ్డేపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యావికాస ప్రేరణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెల్సన్ మండేలా జయంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాథమిక దశనుంచే విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం నరేందర్ నాయక్, విద్యావికాస ప్రేరణ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పెండ్లి ఉపేందర్‌రెడ్డి, కేయూ అసిస్టెంట్ రిజిస్ట్రార్ అశోక్‌బాబు, సోషల్ వర్కర్ పద్మ, ఎల్ఐసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ నర్సింహులు, రిటైర్డ్ హెచ్ఎం సంపత్, ఉపాధ్యాయుడు శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పోరాట ఫలితంగానే రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్



హన్మకొండ: బీఆర్ఎస్ పోరాట ఫలితంగానే కాజీపేట రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ మంజూరైందని పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ తెలిపారు. ఈ ఫ్యాక్టరీ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజల కల, హక్కు అని, దాని సాధన కోసం గల్లీ నుంచి ఢిల్లీ వరకు, అసెంబ్లీ నుంచి పార్లమెంట్ వరకు కేంద్రంలోని నాటి కాంగ్రెస్, నేటి బీజేపీ ప్రభుత్వాలపై పోరాటం, డిమాండ్ చేశామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్రంలో 30 ఏళ్లు పాలించిన కాంగ్రెస్, 10 ఏళ్లు బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు కోచ్ ఫ్యాక్టరీ కేటాయించకుండా అన్యాయం చేశాయని తెలిపారు. ఓరుగల్లు ప్రజలు అనేక పోరాటాలు, ఐక్య ఉద్యమాలు చేపట్టడంతో రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ మంజూరయిందని ఆయన పేర్కొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



హన్మకొండ/కాజీపేట: హనుమకొండ విద్యానగర్, చైతన్యపురి కాలనీల్లోని సెయింట్ పీటర్స్ ఎడ్యుస్కూళ్లలో హనుమకొండ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాసన్ కంటి ఆస్పత్రి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ మేరకు 500 మంది విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరంలో లయన్స్ క్లబ్ ప్రతినిధి తేరాల రమేష్, పాఠశాల కరస్పాండెంట్ ఎస్.నారాయణ రెడ్డి, లయన్స్ క్లబ్ ప్రతినిధులు ప్రభాకర్, రాజశేఖరం, అరుణ్ పాల్గొన్నారు.

పింగిళి విద్యార్థిని ప్రతిభ

విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ కళాశాలలో బీఎస్సీ లైఫ్‌సైన్స్ చదివిన విద్యార్థిని పి.శ్రీహితకు పాండిచ్చేరిలోని సెంట్రల్ యూనివర్సిటీలో ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రీషన్ పీజీ కోర్సులో సీటు లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళి తెలిపారు.

సొంతింటి కల సాకారం చేస్తున్న ప్రభుత్వం

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు

హన్మకొండ: పేదల సొంతింటి కలను కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సాకారం చేస్తోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గం కాజీపేట మండలంలోని 137 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్, 36 మందికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు ఏ సమస్య వచ్చినా 80961 07107 నంబర్‌కు ఫోన్ చేసి చెబితే పరిష్కరిస్తానని అన్నారు.

నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

హసన్‌పర్తి: వర్ధన్నపేటను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. ఒకటో డివిజన్ శ్రీనివాస్ కాలనీని శుక్రవారం సందర్శించారు. ఈ మేరకు కాలనీలో శాశ్వత రోడ్లు, మురుగునీటి కాల్వలు నిర్మించాలని ఆయనను స్థానికులు కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ బిల్లా ఉదయ్‌కుమార్ రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పింగిలి వెంకట్రామ్ నర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఇళ్ల ప్రొసీడింగ్స్ అందిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

ప్రతీ డివిజన్‌ను అభివృద్ధి చేస్తా: నాయిని



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, మేయర్

హన్మకొండ చౌరస్తా: గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా పార్టీలకు అతీతంగా తన పరిధిలోని ప్రతీ డివిజన్‌ను అభివృద్ధి చేస్తానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండ 5వ డివిజన్ పరిధిలోని దాసరి వాడ, కొత్తూలలో రూ.1.03 కోటి వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వ పాలన సాగుతోందని అన్నారు. అర్హులందరికి సంక్షేమ పథకాలు అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి, స్థానిక కార్పొరేటర్ పోతుల శ్రీమన్నారాయణ, స్రవంతి, గణేష్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ సభలను జయప్రదం చేయండి

ఖిలా వరంగల్: ఈ నెల 30, 31వ తేదీల్లో నగరంలో జరగనున్న సీపీఐ జిల్లా 2వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి పిలుపునిచ్చారు. ఈ మేరకు వరంగల్ శివనగర్ పార్టీ జిల్లా కార్యాలయం తమ్మెర భవనంలో సంగీ ఎలేందర్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. 1925, డిసెంబర్ 26వ తేదీన ఉత్తరప్రదేశ్ రాష్ట్రం కాన్పూర్ నగరంలో సీపీఐ ఏర్పాటైన నాటి నుంచి శతాబ్ద కాలంగా అనేక సమరశీల పోరాటాలు నిర్వహించినట్లు మేకల రవి తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న మేకల రవి

ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాష్‌మియా, పనాస ప్రసాద్, నాయకులు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టీఐపై అవగాహన కల్పించాలి



సదస్సులో పాల్గొన్న చంటి ముదిరాజ్, సభ్యులు

హన్మకొండ అర్బన్: సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేలా ఆర్‌టీఐ సాధన కమిటీ విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించాలని సమాచారం హక్కు చట్టం (ఆర్‌టీఐ) సాధన కమిటీ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ చంటి ముదిరాజ్ సూచించారు. నగరంలోని థౌజండ్ పిల్లర్స్ హోటల్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా సమాచార హక్కు చట్టం సాధన కమిటీ కార్యాచరణ సదస్సు శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో సాధన కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి, ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం, ఉపాధ్యక్షుడు గోపీనాథ్, అధికార ప్రతినిధి ఎన్.దిలీప్‌రావు, వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షులు బొల్లం విజయ్, మీసాల విజయ్, వరంగల్, హనుమకొండ జిల్లాల కార్యదర్శులు రమేష్, రాజ్‌కుమార్ కురుమ, వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను సదానందం, ములుగు వర్కింగ్ ప్రెసిడెంట్ శివ, భూపాలపల్లి జనరల్ సెక్రటరీ తోట సురేష్, ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రభుత్వ భిక్ష కాదు

నయీంనగర్: ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు ప్రభుత్వ భిక్ష కాదని, అవి పొందడం విద్యార్థుల హక్కు అని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు అన్నారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గత బీఆర్ఎస్ ప్రభుత్వంలాగా విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. గురుకులాల విద్యార్థుల ఆత్మహత్యలు ప్రభుత్వ హత్యలే అని ఆరోపించారు. కాకతీయ యూనివర్సిటీ భూముల జోలికి వస్తే ఊరుకునేది లేదని తేల్చిచెప్పారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్, సుజిత్, హరిచరణ్, శ్రీనివాస్, శివ, శ్రీకాంత్, రాజ్‌కుమార్, రాకేష్, సిద్ధార్థ పాల్గొన్నారు.

పెన్షన్లు పెంపుదల చేయాలి

కేయూ క్యాంపస్: ఇచ్చిన హామీ ప్రకారం చేయూత పెన్షన్లను ప్రభుత్వం పెంచి ఇవ్వాలని కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ పెదమళ్ల శ్రీనివాస్‌రావు సూచించారు. ఈ మేరకు ఆగస్టు 13న హైదరాబాద్‌లో జరగనున్న చేయూత పెన్షన్‌దారుల మహాగర్జనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాకతీయ యూనివర్సిటీలో గెస్ట్‌హౌజ్‌లో వికలాంగుల సంఘం కేయూ ఇన్‌చార్జ్ బొస్క నాగరాజు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించి సమావేశంలో కేయూ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ డాక్టర్ పుల్లా శ్రీనివాస్, తెలుగు విభాగం అధిపతి డాక్టర్ మామిడి లింగయ్య మాట్లాడుతూ ఈ నెల 29న హనుమకొండలో పెన్షన్‌దారుల సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు.

టీచర్ల పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలి

రామన్నపేట: ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలైన జీపీఎఫ్, సప్లిమెంటరీ జీతాల బిల్లులు, మెడికల్ బిల్లులు, పెన్షన్ బెనిఫిట్స్, తదితర పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని టీఎస్‌యూటీఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి నామోజు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. వివిధ పాఠశాలల్లో టీఎస్‌యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. సంఘం వరంగల్ మండల అధ్యక్షుడు రవీందర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు హరిప్రసాద్, విజయ్, కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్‌టీయూ సభ్యత్వ నమోదు

విద్యారణ్యపురి: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఎస్‌టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఆట సదయ్య డిమాండ్ చేశారు. జిల్లాలోని వివిధ పాఠశాలల్లో ఎస్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కామగోని రాంబాబు, ప్రధాన కార్యదర్శి వేమునూరి రాంబాబు, కమలాపూర్ మండల అధ్యక్షుడు కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి వీరబ్రహ్మేంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

హన్మకొండ అర్బన్: వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కార్యదర్శి బొక్క దయాసాగర్, హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజుగౌడ్, శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు నాయకులతో కలిసి కలెక్టర్ స్నేహ శబరీష్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి రమేష్, సంయుక్త కార్యదర్శి తిలక్, పశ్చిమ నియోజకవర్గ అధ్యక్షుడు అనిల్‌రెడ్డి, కార్యదర్శి వెంకటేష్, సంపత్‌రెడ్డి, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి చేయూత



వరంగల్ అర్బన్: నగరంలోని 13వ డివిజన్ ఎల్బీనగర్ ఎస్సీవాడకు చెందిన రేణుకుంట్ల చరణ్, లక్ష్మి దంపతులకు చెందిన మూడేళ్ల పాప రేణ్యగ్రేసీ ఇటీవల అనారోగ్యంతో ఎంజీఎం దవాఖానలో చేరి చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ మేరకు బాధిత నిరుపేద కుటుంబానికి సామాజిక సేవా సంస్థ వ్యవస్థాపకుడు ఎలుకపెల్లి శ్రీధర్, సంస్థ సభ్యులు మొలుగురి సరిత, రేణుకుంట్ల స్పందన 50 కిలోల బియ్యాన్ని శుక్రవారం అందించారు.

బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ

ఖిలా వరంగల్: వరంగల్ తూర్పు శివనగర్ 34వ డివిజన్‌లో పెరుగు సదానందం, ఖిలా వరంగల్ మధ్యకోటలో వేల్పుల సంతోష్ యాదవ్, పత్రి రాజేశ్వరి, 39 డివిజన్ తోట్లవాడలో చకినాల సువర్ణ, 40వ డివిజన్ ఉర్సులో కొండమీది అనంతమ్మ ఇటీవల మృతి చెందారు. ఈ మేరకు బాధిత కుటుంబ సభ్యులను బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ శుక్రవారం పరామర్శించారు.

పార్కు.. కబ్జాకు గురికాకుండా చర్యలు

హసన్‌పర్తి: 66వ డివిజన్ ఆర్టీసీ కాలనీలో ఉన్న పార్కు స్థలం కబ్జాకు గురికాకుండా తగు చర్యలు చేపడుతామని అధికారులు తెలిపారు. హసన్‌పర్తి మండల కేంద్రంలో 37 ఏళ్ల క్రితం ఆర్టీసీ ఉద్యోగులు 9.2 ఎకరాల భూమిని కొనుగోలు చేసి, 107 ప్లాట్లుగా విభజించారు. అందులో 22 గుంటల స్థలాన్ని పార్కుకు కేటాయించగా, అది కబ్జాకు గురైంది. ఈ మేరకు పార్కు స్థలాన్ని రక్షించాలని నగర మేయర్ సుధారాణితో పాటు కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌కు ఆర్టీసీ కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. కార్పొరేషన్ అధికారులు శుక్రవారం ఆ స్థలాన్ని సందర్శించి పరిశీలించారు.

కలహాలు వీడి కలిసి పనిచేద్దాం

వరంగల్ చౌరస్తా: వర్గాలుగా విడిపోవడంతో కలహాలే తప్ప సాధించిదేమీలేదని, ఇకనుంచి కలిసి పనిచేద్దామని వరంగల్ గోవిందరాజుల గుట్ట దేవాలయం అర్చకులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. శ్రీదేవి భూదేవి నీలాదేవి సతీసమేతుడైన గోవిందరాజ స్వామి ఆలయంలో అర్చకులు శుక్రవారం సమావేశమై భేదాభిప్రాయాలు వీడనాడాలని నిశ్చయించుకున్నారు. దేవాలయ ప్రధానార్చకుడు వరయోగుల శ్రీనివాసాస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో అర్చకులు వరయోగుల లక్ష్మణస్వామి, జగన్నాథం వేణు స్వామి, శ్రీకాంత్ స్వామి, వేణుమాధవ స్వామి, కిరణ్ స్వామి, ప్రసాద్ స్వామి, గోవింద్ స్వామి, అరుణ్ స్వామి పాల్గొన్నారు.

ఎంజీఎం మార్చురీ పరిశీలన

ఎంజీఎం: ఎంజీఎం ఆస్పత్రి మార్చురీలోని ఫ్రీజర్లను పరిస్థితిని తెలంగాణ మెడికల్ సర్వీస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎంఎస్ఐడీసీ) ఇంజనీరింగ్ విభాగం అధికారి వేణు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఫ్రీజర్ల పనితీరును పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఫ్రీజర్లలో కొన్ని అధ్వానంగా ఉన్నాయని, మరికొన్నింటిని స్వల్ప మరమ్మతులతో వినియోగంలోకి తీసుకురావచ్చని అన్నారు. త్వరలోనే పూర్తిస్థాయి నివేదికను రాష్ట్ర ఉన్నతాధికారులకు అందించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎంజీఎం ఆర్ఎంఓ శశికుమార్, ఫోరెన్సిక్ వైద్యులు ఉన్నారు.

రైల్వే స్టేషన్ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

హసన్‌పర్తి: హసన్‌పర్తి రైల్వే స్టేషన్ అభివృద్ధికి నిధులు కేటాయింపునకు కృషి చేయాలని కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ కోరారు. ఈ మేరకు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్యను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేశారు. హసన్‌పర్తి రోడ్ రైల్వే స్టేషన్‌లో నెలకొన్న సమస్యల గురించి వివరించారు. కార్యక్రమంలో రైల్వే బోర్డు సభ్యులు దాసరి రాజు, శ్యామ్, బీజేపీ హసన్‌పర్తి మండల అధ్యక్షుడు మారం తిరుపతి, బీజేవైఎం డివిజన్ అధ్యక్షుడు కుంబకార్ సాయి, తదితరులు పాల్గొన్నారు.

ఎంసీపీఐ (యూ) కుల్దీప్ వర్గంతో పనిచేస్తాం

వరంగల్ చౌరస్తా: ఎంసీపీఐ (యూ) రెండు వర్గాలుగా విడిపోయిందని, అందులో కుల్దీప్ వర్గంతో కలిసి ఎంసీపీఐ కలిసి పనిచేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి నర్ల చంద్రశేఖర్ స్పష్టం చేశారు. వరంగల్ వెంకట్రామ జంక్షన్‌లోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర నాయకుడు సింగతి సాంబయ్య అధ్యక్షతన శుక్రవారం జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మాదం తిరుపతి, నాయకులు మాలోత్ రాజేష్ నాయక్, బాషిపాక రమేష్, బల్ను్సకూరి నరసయ్య, బిట్ల సమ్మయ్య, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

హన్మకొండ చౌరస్తా: ఆరోగ్య మహిళా కార్యక్రమంలో భాగంగా హనుమకొండలోని పెద్దమ్మగడ్డ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ అధికారి డాక్టర్ సంజయ్ తాళ్లపెల్లి ఆధ్వర్యంలో గర్భిణులకు శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ముఖ్యంగా గర్భిణులు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై దాడి హేయం

కేయూ క్యాంపస్: బీసీ ఉద్యమ గొంతుక ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై దాడి చేయడం హేయమైన చర్య అని, దాడి చేసిన జాగృతి కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ బీసీ గ్రాడ్యుయేషన్ ఫోరం అధ్యక్షుడు డాక్టర్ మేడారపు సుధాకర్ డిమాండ్ చేశారు. కేయూలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో సమావేశంలో ఫోరం ప్రధాన కార్యదర్శి డాక్టర్ తాళ్లపెల్లి నరేష్, కేయూ బాధ్యులు పాల్గొన్నారు.

జాతీయ జెండా గద్దె ధ్వంసంపై ఫిర్యాదు

ఖిలా వరంగల్: వరంగల్ 41వ డివిజన్ విశ్వనాథ కాలనీలో జాతీయ జెండా గద్దెను ధ్వంసం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఆ కాలనీ అధ్యక్షుడు కర్నె రవీందర్ కోరారు. ఈ మేరకు వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

23న విద్యాసంస్థల బంద్

హన్మకొండ: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 23న చేపట్టిన విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద విద్యాసంస్థల బంద్ వాల్‌పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు స్టాలిన్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బాషబోయిన సంతోష్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి రాచకొండ రంజిత్, జిల్లా ఉపాధ్యక్షురాలు అనూష, జిల్లా కార్యదర్శి మర్రి మహేష్, ఏఐఎస్‌బీ జిల్లా నాయకులు ఫుర్కాన్, ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర కన్వీనర్ మాస్ సావిత్రి, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బొజ్జ జ్యోతి, ఆయా సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ చౌరస్తా: ఈ నెల 23న తేదీన వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. వరంగల్ అండర్ బ్రిడ్జి ఓంకార్ భవన్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు మార్త నాగరాజు, దిడ్డి, పార్థసారథి, లాడెళ్ల శరత్, చుక్క ప్రశాంత్, యార ప్రశాంత్ రెడ్డి, సూర్యతేజ, అలవాల నరేష్, సాయి, రాజేష్, రవి పాల్గొన్నారు.

ఫుట్‌బాల్స్ తీసుకెళ్లాలి

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కేంద్రీయ విద్యాలయ పాఠశాలలో ఉన్న ఫుట్‌బాళ్లను ఈ నెల 23వ తేదీలోపు తీసుకెళ్లాలని కేంద్రీయ విద్యాలయ పీడీ కొర్ర శ్రీనివాస్ అన్నారు. ఫుట్‌బాల్స్ వితరణ బాధ్యతను పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయ పాఠశాలకు ఫుట్‌బాల్ అసోసియేషన్ అప్పజెప్పినట్లు తెలిపారు. 99089 45071 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.





సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎల్. రాకేష్ వర్మ (SR) : 9885438059 (హన్మకొండ)
వి. రాజ్ కుమార్ (SR) : 9966290903 (హన్మకొండ)
కె. రవీందర్ (SR) : 9705236356 (వరంగల్)
పి.చంద్రశేఖర్ (ACO) : 9963646944 (వరంగల్)